# తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసిన యాదవ నాయకులు



**కామారెడ్డి రాజముద్ర న్యూస్**

మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కౌన్సిలర్గా అర్కల ప్రభాకర్ యాదవ్ గెలుపొందిన సందర్భంగా జిల్లా యాదవ సంఘ సభ్యులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తన ఇంటిలో మర్యాదపూర్వకంగా కలిశారు, కలిసిన వారిలో అటికెల మల్లేష్ యాదవ్, లింగం యాదవ్, యాది యాదవ్ తదితరులు ఉన్నారు.

# అన్నారంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్**

రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో సోమవారం రోజున ఉపాధి హామీ పని ప్రారంభించిన సర్పంచ్ లతా శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దయానంద్, టెక్నికల్ అసిస్టెంట్ నరసయ్య, వార్డు మెంబర్స్ సాయిరాం గౌడ్, దేవదాస్, ఎల్లయ్య, కారాబర్ రాజేందర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# విద్యా కమిషన్ నివేదిక అశాస్త్రియం

• **ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు**

**వివి నాయక్**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్**

తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక శాస్త్రీయమని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్, సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డిలు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు బోలోపేతం కావాలంటే ఈ నివేదికను తిరస్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలల మూసివేత దిశగా ప్రతిపాదనలో సమర్పించిందని తెలిపారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ బాగు గురించి సిఫారసు చేయవలసిన విద్యా కమిషన్ టీచర్ల వేతనాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని తెలిపారు అభివృద్ధి చెందిన దేశాలలో విద్యా విధానాన్ని గురించి అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేయాలని చూసినప్పుడు అక్కడ ఉపాధ్యాయుల జీతాలు కూడా ఇక్కడ అమలు చేస్తే బాగుంటుందని కోరారు ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చూపకుండా కొత్త సమస్యలను సృష్టించే విధంగా నివేదిక ఉందని ఆవేదన వ్యక్తం చేశారు కమిషన్ నివేదికలో ఉపాధ్యాయుల జీతాలు ఎక్కువ అని పొందుపరచడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా విద్యా కమిషన్ నివేదికను మార్చి విద్యారంగ అభివృద్ధి దిశగా పనిచేయాలని కోరారు.

# గట్టుసింగారం గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ వితరణ

**దాతను అభినందించిన సర్పంచ్ మేడేపల్లి విజయ**




**ఖమ్మం, రాజముద్ర న్యూస్..**

కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామ ప్రజల అవసరాల దృష్ట్యా,మరణించిన వారి భౌతిక కాయాన్ని భద్రపరచడానికి ఖమ్మం నగరానికి చెందిన వంగూరి వెంకటనారాయణ డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను సర్పంచ్ మేడేపల్లి విజయ సమక్షంలో సోమవారం వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకి అత్యవసర పరిస్థితుల్లో ఈ ఫ్రీజర్ బాక్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.పల్లె ప్రాంతాలలో ఎవరైనా చనిపోతే ఫ్రీజర్ బాక్స్ అందుబాటులో లేక సుదూర ప్రాంతాలలో ఉన్న వారి బంధువులు కడసారి చూపుకు నోచుకోకుండానే అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందని అలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలని ఉద్దేశ్యంతో గ్రామానికి ఫ్రీజర్ బాక్స్ ను అందించారని చెప్పారు.అనంతరం వెంకటనారాయణను అభినందించి,శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శీలం జానయ్య,పంచాయితీ కార్యదర్శి సాలె ఉపేందర్,వార్డు సభ్యులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ కొలువులకు పెరుగుతున్న డిమాండ్

• ఏఐ స్కిల్స్ ఉంటే సులువుగా ఉద్యోగాలు
• మంచి వేతనాలు పొందేందుకూ అవకాశం
• ఏఐ నైపుణ్యాల ఆవశ్యకత గుర్తించిన కేంద్రం
• నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాల అమలు
• ఏఐ అవకాశాలను అందుకునేలా ప్రణాళిక




**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

నిత్యజీవితంతో పాటు ఉద్యోగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర పెరుగుతోంది. అన్ని రంగాల్లోకి ఏఐ వేగంగా ప్రవేశిస్తోంది. ఈ నేపథ్యంలో ఏఐ నైపుణ్యాలు కలిగిన వారికి డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగాలను ఆశిస్తున్న అభ్యర్థులకు ఏఐ నైపుణ్యాలు ఉంటే మెరుగైన అవకాశాలు వస్తున్నాయి. కృత్రిమ మేధ ప్రాముఖ్యతను ముందే గుర్తించిన కేంద్ర ప్రభుత్వం యువతలో ఏఐ నైపుణ్యాలు పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోంది. వీటి ద్వారా యువతకు ఏఐ శక్తిని అందిస్తోంది. ప్రపంచంలోనే యువ శ్రామికశక్తి కలిగిన దేశాల్లో భారత్ ముందుంది. దేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు. దీంతో కేంద్రం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఏఐ ఉద్యోగాలకు యువతను సంసిద్ధం చేస్తున్నాయి.

## ఏఐ నైపుణ్యాలు, ఉద్యోగాలకు డిమాండ్

ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. దక్షిణాసియాలో మొత్తం ఉద్యోగ ప్రకటనల్లో 6.5 శాతం ఏఐకి సంబంధించినవే. ప్రపంచంలో మొత్తం ఏఐ ప్రాజెక్టుల్లో భారత్ నుంచే 19.9% ఉన్నాయని నివేదికలు చెప్తున్నాయి. భారత్‌లో 2025లో వెలువడిన ఉద్యోగ ప్రకటనల్లో 5.8 ఉద్యోగాలకు ఏఐ నైపుణ్యాలు అవసరం. హైదరాబాద్‌లో అయితే ఇది 9.57 శాతంగా ఉంది. ఇతర డిజిటల్ నైపుణ్యాలు ఉన్నవారికి సగటున 12 శాతం అధిక వేతనాలు అందుతుండగా, ఏఐ నైపుణ్యాలు ఉన్న వారు సగటున 28 శాతం ఎక్కువ వేతనాలు అందుకుంటున్నారు.

## మెరుగైన డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

ఏఐ వినియోగం, సంసిద్ధతలో భారత్ ముందంజలో ఉంది. ఇందుకోసం కావాల్సిన డిజిటల్ సధుపాయాలను సైతం వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్ సహా మూడు నగరాల్లో జాతీయ డేటా సెంటర్లను ఎన్ఐసీ ఏర్పాటుచేసింది. దేశంలో ఇంటర్నెట్ కనెక్షన్లు 100 కోట్ల మైలురాయిని దాటాయి. దేశంలో 40 కోట్ల మందికి పైగా 5జీ వినియోగదారులు ఉన్నారు. 2019లో 19.35 లక్షల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఉండగా ఇప్పుడు 42.36 లక్షల కిలోమీటర్లకు పెరిగింది. దేశంలో 2.14 లక్షల గ్రామాలకు బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీ ఉంది. ఏఐ కోసం ఇప్పటికే భారత్ 38 వేల జీపీయూలను(గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు)ను అందుబాటులో ఉంచింది.

## ఏఐ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

జాతీయ విద్యావిధానం-2020లో ఏఐ విద్యకు ప్రాధాన్యత ఉంది. అన్ని స్థాయిల్లోనూ పాఠ్యప్రణాళికలో ఏఐని చేర్చడంతో విద్యార్థి దశ నుంచి ఏఐ నైపుణ్యాలు పెరుగుతాయి. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్కిల్ ఇండియా మిషన్ ఎస్ఓఏఆర్(స్కిల్లింగ్ ఫర్ ఏఐ రెడీనెస్) అనే కార్యక్రమం ద్వారా 1.34 లక్షల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏఐ నైపుణ్యాల శిక్షణ ఇప్పించింది.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, నేషనల్ ఈ-గవర్నన్స్ డివిజన్ కలిసి యువ ఏఐ(యూత్ ఫర్ ఉన్నతి విత్ ఏఐ) కార్యక్రమం ద్వారా 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఏఐ నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయి. యువ ఏఐ ఫర్ ఆల్ అనే కార్యక్రమం ద్వారా ఫ్యుచర్‌స్కిల్స్ ప్రైమ్, ఐజీఓటీకర్మయోగి, దీక్ష వంటి వేదికల నుంచి తెలుగు సహా 11 భాషల్లో ప్రాథమిక ఏఐ నైపుణ్యాలను కల్పిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, నాస్కామ్ కలిసి ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ ఇనిషియేటీవ్ అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగులకు ఏఐ, బిడ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి నైపుణ్యాలపై శిక్షణ అందిస్తున్నాయి. కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రారంభించిన స్కిల్ ఇండియా డిజిటల్ హబ్‌లోనూ ఏఐ, మెషీన్ లెర్నింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

# శిధిల భవనంలో బాలికల బస

**భయానక వాతావరణంలో చదువులు**
**ప్రాణభద్రతపై అనుమానాలు తక్షణ చర్యలకు స్థానికుల డిమాండ్**






**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్**

మండలంలోని ముల్కనూర్ బాలికల వసతి గృహం శిధిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నివసిస్తున్న విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చదువుకోడానికి ఆశ్రయం కల్పించాల్సిన హాస్టల్ ఇప్పుడు ప్రమాద సూచికగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా గోడలు కూలిపోతాయో, పైకప్పు పెచ్చులు ఊడిపడతాయో అన్న భయంతో విద్యార్థినులు రాత్రులు గడుపుతున్నట్లు సమాచారం.

## గోడల పగుళ్లు, పైకప్పు బీటలు.. భవనం ప్రమాదకరం.

వసతి గృహ భవనం పలు చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. గోడలు చిట్లిపోవడం, స్లాబ్‌లకు పగుళ్లు ఏర్పడటం, పైకప్పు సిమెంట్ పొరలు ఊడిపడటం, ఇనుపరాడ్లు బయటపడటం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. గదుల్లో తడి, మూలల్లో బీటలు, సిమెంట్ పెచ్చులు ఊడిపడటం నిత్యకృత్యంగా మారాయి. ఈ పరిస్థితుల్లోనే బాలికలు నిద్రపోవాల్సి వస్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.రాత్రివేళల్లో గోడల చప్పుళ్లు వినిపించడం, పైకప్పు కదలికలు అనుభవించడంతో కొందరు విద్యార్థినులు గదుల్లో కాకుండా వరండాల్లో గుంపులుగా నిద్రిస్తున్నారనే సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది.

## బాత్రూమ్‌ల దుస్థితి – ఆరోగ్య సమస్యల భయం

హాస్టల్‌లోని బాత్రూమ్ గోడలు పగుళ్లతో నిండిపోయాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, శుభ్రత లోపించడం, నీటి సమస్యలు వంటి అంశాలు విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పరిశుభ్రత లోపం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక హాస్టల్ ప్రాంగణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ కూడా బలహీన స్థితిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అది ఎప్పుడు కూలి పోతుందో అన్న భయం నెలకొంది. ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.


## హాస్టల్ ప్రాంగణంలోనే ప్రాథమిక పాఠశాల తరగతులు

పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా ఇదే ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనం సమీపంలో చిన్నారులు చదువుకోవాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇది మరింత ఆందోళన కలిగిస్తోంది.

## నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆరోపణలు

వసతి గృహ నిర్వహణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు వార్డెన్లు మారినా పరిస్థితిలో మార్పు రాలేదని స్థానికులు అంటున్నారు. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





**ఎండాకాలంలోనే కొత్త భవన నిర్మాణం చేపట్టాలి**

వేసవి కాలం కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలం రాకముందే పాత భవనాన్ని ఖాళీ చేసి ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని, అదే సమయంలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఆలస్యం జరిగితే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు.

**కొత్త కలెక్టర్ జోక్యం అవసరం**

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి భవన పరిస్థితిపై పరిశీలన చేపట్టాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చిన్నారుల ప్రాణాలకు మించినది ఏదీ లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. చదువుల కోసం వచ్చిన బాలికలు భయంతో గడపకుండా సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి విద్యార్థినుల భయాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

